క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



మనోజ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న మేస్త్రీ జావిద్

ఆదోనిటౌన్‌: పట్టణంలోని కునిమొహల్లా వీధికి చెందిన మేస్త్రీ జావిద్, తన అనుచరులు నిజామీ, సద్దామ్, ఖాజా మరికొందరితో కలిసి మనోజ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేస్తానని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రంలో భక్తుల రద్దీ



ఈరన్న స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

మంత్రాలయం: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులతో క్యూలైన్లు, వ్యాపార దుకాణాలు కిటకిటలాడాయి. స్వామివారికి తలనీలాలు ఇచ్చుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్లు వెంకటేశ్వర్లు, మల్లికార్జున ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నారాయణపురంలో సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న గ్రామస్తులు

ఆదోనిటౌన్‌: ఆదోని మండలం నారాయణపురం గ్రామస్తులు సోమవారం సహపంక్తి భోజనం చేశారు. కార్తీకమాస పూజల ముగింపు సందర్భంగా గ్రామంలో వెలసిన శ్రీగర్జిలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామపెద్దలు, ప్రజలు సహపంక్తి భోజనంతో వేడుకలు ముగిశాయి.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతిపత్రం స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

ఆదోనిటౌన్‌: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నీటి సరఫరాను మెరుగుపరచాలని, అక్రమ కట్టడాలు తొలగించాలని, రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆమెకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కార నిమిత్తం సంబంధిత సెక్షన్ అధికారులకు జారీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. నిర్ణీత సమయంలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వన్‌టౌన్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీనారాయణ

ఆదోనిఅర్బన్‌: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలుగా స్టేషన్‌కు ఎస్‌ఐ లేకపోవడం, మూడు రోజుల క్రితం సీఐ విక్రమసింహా బదిలీ అయిన విషయం విదితమే. దీంతో జిల్లా ఉన్నతాధికారులు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణను ఆదోని వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఈశ్వరస్వామి, సుంకులమ్మ

ఆదోనిరూరల్‌: కార్తీక మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాంత్రికి గ్రామంలో ఉన్న ఈశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరగా అలంకరించారు. రాత్రి భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం సైతం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామశివారులోని కొండలో వెలసిన సుంకలమ్మకు కుంభోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మెరుగైన పేదల జీవన ప్రమాణాలు



గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం కౌతాళం సచివాలయం-2లో కాచాపురం సర్పంచ్ జయమ్మతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు. తారతమ్యాలు లేకుండా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రగతి పనులు చేయడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రతి పేదోడు సంతోషంగా ఉన్నప్పుడే ప్రగతి సాధించినట్లని అభిప్రాయపడ్డారు. ఇవేమి పట్టించుకోని ప్రతిపక్ష టీడీపీ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేయడం టీడీపీ నేతలకు నచ్చడం లేదన్నారు. ప్రజల నుంచి తమ ప్రభుత్వానికి మంచి రావడం టీడీపీ నాయకులకు మింగుడుపడటం లేదని దుయ్యబట్టారు. ప్రజల దీవెనలతో వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీనే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచార్, సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు, జెడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వడ్డెరాము, మాజీ ఎంపీటీసీ సొదరిబసవరాజు, మాజీ సర్పంచ్ అవతారం, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి, రాజ్‌అహ్మద్, అబ్దుల్‌సమద్, భీమేష్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

దళారి వ్యవస్థ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

పెద్దకడబూరు: దళారి వ్యవస్థను సమూలంగా నిర్మూలించి ప్రభుత్వం నుంచి అందించే ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు నేరుగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు సంక్రమంగా అందుతున్నాయా అని గ్రామస్తులను ఆరా తీశారు. ఏవైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో దళారి వ్యవస్థకు తావులేదన్నారు. ఎవ్వరికీ పైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలోని సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆదిఆంధ్ర పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని లేని పక్షంలో వంట ఏజెన్సీలను తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, గజేంద్రరెడ్డి, దేవదానం, పూజారి ఈరన్న, పరమేష్, ఎంపీడీఓ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ పాల్గొన్నారు.

రూ.2.30 కోట్లతో బీటీ రోడ్డుకు భూమి పూజ

మండల పరిధిలోని హెచ్.మురవణి నుంచి దొడ్డిమేకల గ్రామం మీదుగా పెద్దకడబూరు వరకు రూ.2.30 కోట్లతో 8.5 కి.మీ బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డుకు తమ ప్రభుత్వంలో మోక్షం లభించిందన్నారు. అలాగే దొడ్డిమేకల గ్రామంలో 300 మీటర్లు, హెచ్.మురవణిలో 400 మీటర్ల రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు.



హెచ్.మురవణి గ్రామంలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చెత్త సేకరణ కేంద్రాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కౌతాళం: చెత్త సేకరణ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. సోమవారం టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రఫీక్‌అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత ప్యాపిలి

ఆలూరు రూరల్‌: మండలంలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి రోథోత్సవం పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతగా నిలిచిన ప్యాపిలి జట్టుకు మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.51 వేలు, రెండోస్థానంలో నిలిచిన మొలగవల్లి చెన్నకేశవ స్వామి జట్టుకు ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ సహకారంతో రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన ప్యాపిలి-బీ జట్టుకు బహుమతులు అందజేశారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం

● సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్‌: స్పందనలో వచ్చే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కార మార్గం చూపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీలైనంత వరకు ఆయా మండల కేంద్రాల్లోని తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మినారాయణ, ఉప తహసీల్దార్‌లు వలీబాషా, కౌసర్‌భాను పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన వినతుల్లో కొన్ని..

● ఇంటి స్థలం మంజూరు చేయాలని గోనెండ్ల మండలం గంజహళ్లి గ్రామానికి చెందిన చిన్న తిక్కయ్య కోరారు.

● మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన సర్వేనంబర్ 496ఏలో 4 ఎకరాల భూమి తమ పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

● చాలా కాలంగా పొలాన్ని సాగు చేస్తున్నామని, ఆ భూమికి ఎలాంటి పత్రాలు లేవని, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఆదోని పట్టణానికి చెందిన రంగమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

● ఆదోని మండలం సాదాపురం గ్రామానికి చెందిన తనకు ఉవ్వనూరు గ్రామంలో సర్వేనంబర్ 44లో 3.50 ఎకరాల భూమి కొనుగోలు ద్వారా సంక్రమించిందని, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు చూపిస్తోందని, విచారణ చేసి న్యాయం చేయాలని కృష్ణవేణి కోరింది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
● హానవాల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'



బసాపురంలో సంక్షేమ బావుటా కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్‌: ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హానవాల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 365 గృహాలను సందర్శించారు. నవరత్నాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామాల్లో మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు మెరుగునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి సుమారు రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూర్చుతోందని అన్నారు. జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయని తెలిపారు. గత టీడీపీ హయాంలో పథకాలు పొందాలంటే ఎలాంటి పరిస్థితి ఉండేది ఇప్పుడు ఎలా ఉందో ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. పింఛన్లు, సర్టిఫికెట్లు ఇలా ఏ సేవైనా వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే వస్తున్నాయన్నారు. జన్మభూమి కమిటీల్లాంటి దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని తెలిపారు.

గ్రామాభివృద్ధికి చర్యలు

హానవాల్ గ్రామంలోని 93 మంది పేదలకు జగనన్న కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చామన్నారు. రూ.30 లక్షలతో మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్లు వేస్తామని తెలిపారు. మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో రూ.45 లక్షలతో అదనపు గదుల నిర్మాణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, సర్పంచ్ నారాయణప్ప, ఎంపీటీసీ చాకలి ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, పార్టీ నాయకులు శ్రీలక్ష్మి, గురునాథ్ రెడ్డి, గోపాలస్వామి, చాకలి రాజా, గణేష్‌స్వామి, గొల్ల మల్లికార్జున, క్రిష్టప్ప, లింగప్ప, గిరప్ప, గోవర్ధన్ రెడ్డి, రామలింగేశ్వరయాదవ్, ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ

కోసిగి: పాఠశాలలో విద్యార్థుల స్థాయి ఆధారంగా వారికి అర్థమయ్యేలా సులభతర పద్ధతిలో బోధించాలని మండల విద్యాధికారి నాగేశప్ప అన్నారు. సోమవారం కోసిగిలోని ఎస్‌డబ్ల్యూ, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా జగనన్న గోరుముద్దను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తే వారికి సులభంగా గుర్తుండిపోతుందన్నారు. ప్రత్యేకంగా వెనుకబడి ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక బోధన అందించేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయులు ఓబులేష్ ఉన్నారు.

ఘనంగా షష్టి మహోత్సవాలు

ఆస్పరి: ఆస్పరిలోని ఆంజనేయ స్వామి ఆలయం, రామతీర్థంలో వెలిసిన సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు మల్లికార్జున శర్మ గంగపూజ, అభిషేకం, సుబ్రమణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి మూలమంత్ర హవనం, జయాదిహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

గాయపడిన యువకుడి మృతి

కృష్ణగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. కృష్ణగిరికి చెందిన ఈడిగ మదన్‌మోహన్ గౌడ్ (23) తన పెద్దనాన్న కుమారుడి పెళ్లి కావడంతో శుభలేఖలను పంచేందుకు ఈడిగ నరేంద్రగౌడ్‌తో కలిసి ఈ నెల 6వ తేదీ బైక్‌పై వెళ్లారు. బంధువులకు ఆహ్వానం అందించి వెల్దుర్తి నుంచి కృష్ణగిరి వస్తున్నారు. మార్గమధ్యంలో రహదారిపైకి జింకలు రావడంతో అదుపుతప్పి కింద పడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే 108లో వెల్దుర్తికి ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తండ్రి నరసింహులుగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



పథకాలను వివరిస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్‌: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 7వ వార్డు కునిమొహల్లా వీధిలో కౌన్సిలర్ ఉస్మాన్‌తో కలిసి పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2024లో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రాలయం: సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన ఎరుకల కులస్తులను ఆదుకోవాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌కు ఏపీ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు విజయవాడలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో ప్రతి ఎరుకుల కుటుంబానికి రెండు ఎకరాల భూమి, జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. చాలా మంది ఎరుకలకు తహసీల్దార్లు ఇంటి స్థలాలు ఇవ్వడం లేదన్నారు. ఆదోని డివిజన్‌లో గిరిజన విద్యార్థులకు డివిజన్ కేంద్రంలో ఎస్టీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గుంటూరు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ప్రశాంతి, సమితి రాష్ట్ర నాయకులు దేవనకొండ విజయ్‌కుమార్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎరుకల వీరేష్, ప్రధాన కార్యదర్శి హనుమేష్, కౌతాళం నరసింహులు, పెద్దకడబూరు రాజేష్, శివ, జయమ్మ పాల్గొన్నారు.

నెరవేరిన కల

● భూహక్కు పత్రాల పంపిణీపై సర్వత్రా హర్షం ● కౌతాళంలో 211 రైతులకు లబ్ధి



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ (ఫైల్)

కౌతాళం: పేరుకే రైతులు. ప్రభుత్వ భూమి చేతిలో ఉన్నా ప్రయోజనం శూన్యం. బ్యాంకు రుణం ఇవ్వరు. ప్రైవేటు వ్యక్తులు కుదవ పెట్టుకోరు. ఆపత్కాలంలో ఆదుకునేందుకు సెంటు భూమి తోడు కాని వైనం. ఇన్నేళ్లకు సాగుభూమిపై హక్కులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 35 చట్టంసెక్షన్ 3 ద్వారా అసైన్డు భూములు, మిగులు భూముల రైతులకు శాశ్వత హక్కులు కల్పించింది. బ్యాంకు రుణాలు పొందేందుకు, కుదువ పెట్టుకునేందుకు, క్రయ, విక్రయాలకు వెసులుబాటు కల్పించింది. ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. లబ్ధి రైతుల ఇంట ఆనందం విరబూస్తోంది.

286 ఎకాల భూమికి శాశ్వత హక్కులు

భూముల్లో ఐదు దశబ్దాలుగా పంటలు పండిస్తున్నారే తప్ప ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వేళ ఉపయోగం ఉండేది కాదు. కనీసం పిల్లల పెళ్లిళ్లు, అనారోగ్యం బారినపడి ఆర్థికంగా చితకిపోయి అప్పులు పాలైనా సదరు భూములు అమ్ముకునేందుకు అవకాశం ఉండేది కాదు. భూమిపై హక్కులు కల్పిస్తూ జారీ చేసిన జీఓతో వీరి కలలు నిజమయ్యాయి. మొదటి విడత కింద కౌతాళం మండలంలో 211మంది రైతులకు 286 ఎకరాల భూమికి శాశ్వత భూహక్కు పట్టాలను ఈనెల 6న పంపిణీ చేశారు.

గ్రామం పేరు	లబ్ధి రైతులు	భూమి విస్తీర్ణం
చిరుతపల్లి	80	108.91
ఈచనహాల్	09	11.03
గుడికంబాళి	01	0.84
కుంబళనూరు	18.	28.95
తిప్పలదొడ్డి	12	15.09
తోవి	10	14.13
ఉప్పరహాల్	01	1.02
వల్లూరు	09	14.90
మరళి	01	01.31
ఎరిగేరి	09	09.50
అగసలదిన్నె	07	12.45
బదినేహాల్	49	47.45
కౌతాళం	01	02.00
రౌడూరు	09	13.28
లింగాలదిన్నె	03	04.05

30 ఏళ్ల కల నెరవేరింది



30 ఏళ్ల క్రితం ప్రభుత్వం 1.03 ఎకరాల భూమి ఇచ్చింది. కేవలం పట్టా మాత్రమే ఉంది. సాగుచేసుకుని జీవిస్తున్నా ఎలాంటి రుణం పుట్టని పరిస్థితి. కష్ట పరిస్థితుల్లో కూడా ఆదుకోలేదన్న బాధ వేదించేది. కాని ఆ బాధ లేకుండా చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–చాకలి వీరేశప్ప, బదినేహాల్

చాలా సంతోషంగా ఉంది



నా భర్త బాలస్వామి పేరిట రెండు ఎకరాలు ఇచ్చారు. నా భర్త ఇటీవల మృతిచెందాడు. ఆయన పేరుపై ఉన్న భూమిని నా పేరిట మార్చి హక్కు పత్రం అందజేశారు. సచివాలయానికి పిలిచి పట్టా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మాకు శాశ్వత భూహక్కు కల్పించడంతో ఆర్థిక భరోసా లభించింది.

–సుందరమ్మ, బదినేహాల్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ప్రభుత్వం ఇలాంటి మంచి పథకాలు తీసుకురావడం అభినందనీయం. 1.03ఎకరాలకు శాశ్వత హక్కును కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే పేదలకు కష్టాలు ఉండవు. ఆయన మరోసారి అధికారంలోకి వచ్చి పేదలకు సేవ చేయాలి.

–కోసిగి మారెప్ప, లింగాలదిన్నె

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు

వెల్దుర్తి(కృష్ణగిరి): అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా కూలీలకు మెరుగైన వేతనాలందేలా ఉపాధి పనులు చేపట్టాలని జిల్లా విజిలెన్స్ అధికారి భాస్కర్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సోషల్ ఆడిట్‌లో వెలుగుచూసిన, తిరిగి చేయదగ్గ పనులు, జరిమానాలపై సమీక్షించారు. ఆయా పనులు త్వరగా పూర్తి చేయాలని, రికవరీలు వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. పనులు చేపడుతున్న సందర్భంగా తీసుకోవాల్సిన కొలతలు, సాంకేతిక చర్యలపై అవగాహన కల్పించారు. వెల్దుర్తి ఏపీఓ రాజునాయక్, కృష్ణగిరి ఇన్‌చార్జ్ ఈసీ చెన్నకేశవ, టీఏ శేషిరెడ్డి, ఆయా మండలాల టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

మాళమల్లేశ్వర స్వామి జయంతి పూజలు

హొళగుంద: దేవరగట్టులో సోమవారం మాళ మల్లేశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేద పండితులు, ఆలయ పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, పూల అలంకరణ, మహా రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళారతి, నైవేద్య సమర్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.